సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 24 । జూన్ । 2025



కర్మాగారం ప్రైవేటీకరిస్తే ఊరుకోం

పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీఐటీయు జిల్లా నాయకులు హెచ్చరించారు. 8లో ▸



స్కూళ్ల విలీనంపై ఆగ్రహం

మోడల్ స్కూళ్ల పేరుతో దళితవాడల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను విలీనం చేయడం తగదంటూ దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



మూలనపడిన ఆక్వా ల్యాబ్

మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా మొబైల్ ల్యాబ్ సేవలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంతకాలంగా సేవలు నిలిచిపోయాయి. 8లో ▸

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల నిరసన గళం



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా

భీమవరం(ప్రకాశం చౌక్): అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం సోమవారం భీమవరం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడి కార్యకర్తలు సోమవారం ధర్నా చేశారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు తరలివచ్చి నిరసన గళం వినిపించారు. అనంతరం జేసీ రాహుల్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి, కార్యదర్శి డి.కల్యాణి, భీమవరం ప్రాజెక్టు లీడర్ సీహెచ్ మహాలక్ష్మి మాట్లాడుతూ సాధారణ ఉద్యోగులుగా ఉన్న తమకు జీఓ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పనికి తగిన వేతనం చెల్లించాలన్నారు. సీఐటీయూ నాయకులు వారికి మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజారామోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 81 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని ఐదు కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షలకు 81 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.నారాయణ తెలిపారు. ఉదయం సెషన్‌లో 101 మందికి 92 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 573 మందికి 460 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ కార్మికులు భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం సమ్మెకు దిగారు. రాష్ట్ర జేఏసీ కన్వీనర్ పిట్టా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం 34 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. దీంతో సమ్మెకు దిగినట్టు చెప్పారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.మోహన్‌రావు, జాయింట్ సెక్రటరీ డి.జయరాజు, కార్మికులు పాల్గొన్నారు.

పనిదినాల పెంపు తగదు

ఆకివీడు: కార్మికుల పనిదినాల్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు పెంకి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో సోమవారం కార్మికులతో కలిసి ధర్నా చేశారు. 12 గంటల పనిదినాల వల్ల కార్మికులు శక్తిని కోల్పోతారన్నారు. త్వరగా వృద్ధాప్యానికి గురవుతారని వాపోయారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నిరసనకు బి.రాంబాబు అధ్యక్షత వహించారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీల పరిష్కారం నాణ్యతతో ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ఆన్‌లైన్ చేయడంతో పాటు తప్పనిసరిగా డైరీలో రాసుకోవాలన్నారు.

అర్జీల్లో కొన్ని..

- భీమవరం నరసయ్య అగ్రహారంలోని పార్క్ సమీపవాసులు డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు లేకపోవడంతో వర్షం నీరు నిలిచి అవస్థలు పడుతున్నామని అర్జీ అందించారు.
- అత్తిలి మండలం ఈడూరుకి చెందిన ఘంట సాయిబాబు వృద్ధాప్య పింఛన్ కోసం వినతిపత్రం సమర్పించారు.
- గణపవరం మండలం చిలకంపాడు చెందిన బొడ్డుపల్లి దుర్గాభవాని తన భర్త మరణించారని, తనని, తన కుమారుడిని భర్త కుటుంబసభ్యులు ఇంటి నుంచి గెంటేశారని న్యాయం చేయాలని కోరారు.
- ఉండి మండలం ఉణుదుర్రుకు చెందిన న్యాయవాది సుందరకుమార్ గ్రామంలోని ఎస్సీ పేటలోని పంచాయతీ చెరువు కలుషితంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి వంచనపై గర్జించిన యువత

- బెదిరింపులు, అక్రమ కేసులు, జైళ్లతోనే పాలన
- కూటమి పాలనలో తలలు నరికితే తప్పు లేదా?
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ఏలూరులో యువత పోరుకు కదం తొక్కిన నిరుద్యోగులు
- భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా



యువతకు బాసటగా.. పోరు బాట.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో నిండిపోయిన ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్



జై జగన్ ప్లకార్డుతో..

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ఏలూరు టౌన్: ప్రజలను ఏమార్చడంలో చంద్రబాబు నిపుణుడని, రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బెదిరింపులు, భయపెట్టడం, అక్రమ కేసులు, నెలల తరబడి జైళ్లలో ఉంచేలా చేస్తూ రివేంజ్ రాజకీయాలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సోమవారం ఏలూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరులో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో కలిసి ఆయన పాల్గొన్నారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌లోని ఆరు హామీలు పూర్తి చేశానని చెప్పడంతో ప్రజలు అవాక్కయ్యారన్నారు. జగన్ ఐదేళ్ల ముఖ్యమంత్రి అయినా, చంద్రబాబు 20 ఏళ్లు ముఖ్యమంత్రి అయినా ఒకటేనని, కేవలం ఐదేళ్లలోనే జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 లక్షల కోట్ల మొత్తాన్ని సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు పంచితే చంద్రబాబు మాత్రం ఒక ఏడాదికే 1.30 లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. చంద్రబాబు గతంలో హామీలు అమలు చేయాల్సిన సమయంలోనూ హ్యాపీ సండే, దోమలపై దండయాత్ర అని డైవర్షన్ రాజకీయాలు చేశారని, ఇప్పుడేమో పథకాలడిగితే యోగాంధ్ర, ఊపిరి బాగా తీసుకోవాలంటూ హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పోలవరం నిర్మాణానికి ఖర్చు పెట్టిన దానికంటే పోలవరం ప్రాజెక్టును అందరికీ చూపించడానికి రూ.100 కోట్లు ఖర్చు చేశారని, పని కంటే పబ్లిసిటీ ఎక్కువని విమర్శించారు. పవన్ కల్యాణ్ ప్రతి నియోజకవర్గంలో వంద మంది యువతకు రూ.10 లక్షల చొప్పున ఇస్తానని ఎన్నికల సమయంలో ప్రకటించారని, దానిని ఆయన మరచిపోయారన్నారు. కనీసం మీడియా, ప్రజలైనా దీనిపై ప్రశ్నించాలని సిద్ధార్థరెడ్డి కోరారు.

నిరుద్యోగ భృతి రూ.57 వేల కోట్ల బకాయి

రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే ఆయన కొడుకుకు మాత్రం ప్రతిసారీ ఉద్యోగం ఇస్తున్నాడు గానీ నిరుద్యోగ యువతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. తద్వారా లక్షలాది మంది నిరుద్యోగులను వంచించారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి ఈ ఏడాదికి సంబంధించి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు రూ.57 వేల కోట్లు చెల్లించాలని, లేదంటే వైఎస్సార్‌సీపీ యువత పోరును నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2.50లక్షల మంది వలంటీర్లను తొలగించారని, ఎండీయూలో పనిచేస్తున్న 15 వేల మందికి ఉపాధి తీశారని జక్కంపూడి రాజా మండిపడ్డారు.



యువత పోరు ర్యాలీలో సిద్ధార్థరెడ్డి, రాజా, జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, సమన్వయకర్తలు

ఫీజు బకాయిలు ఎప్పుడిస్తారు?

గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, నేడు కూటమి పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఇలానే ఉంటే రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

బాబు పాలనలో ప్రజలకు కష్టాలే..

సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని ప్రజలంతా అష్టకష్టాలు పడుతున్నారనీ, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, చివరకు వ్యాపారులు సైతం నష్టాల్లో ఉన్నారని పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేందుకు ఇంజనీరింగ్ ఫీజులు సైతం పెంచేశారని ఆరోపించారు. తల్లికి వందనం పథకంలో 87 లక్షల మంది తల్లులు అర్హులు కాగా 57 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూర్చడం కూటమి ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా అందించలేదన్నారు.



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కదం తొక్కి.. నిరసన తెలిపి..

వైఎస్సార్‌సీపీ యువత పోరుకు భారీ ఎత్తున యువత, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోటెత్తారు. వేలాదిగా తరలిరావడంతో ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ స్తంభించింది. ఉదయం 9.30 గంటలకే జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి శ్రేణులు తరలివచ్చారు. పార్టీ జెండాలు, ప్లకార్డులు, ప్లెక్సీలతో యువత కేరింతలు కొడుతూ భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్, సమన్వయకర్తలు మామిళ్లపల్లి జయప్రకాష్ (ఏలూరు), కంభం విజయరాజు (చింతలపూడి), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), తెల్లం బాలరాజు (పోలవరం) దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా ఎస్ఆర్‌పేట, జెడ్పీ కార్యాలయం రోడ్డులో నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించి కొద్దిసేపు ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించటంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. అనంతరం పార్టీ నేతలు ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు.

ఏలూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని, బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముంగర సంజయ్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాదిరాజు మణికంఠ కిషోర్, కోటగిరి సందీప్, బసవ వినయ్, దాలి వెంకటేష్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా మోహనరావు, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ జి.కృష్ణంరాజు, జెడ్పీటీసీలు నిట్టా లీలా నవకాంతం (దెందులూరు), భవానీ (భీమడోలు), కోడే వెంకట కాశీ విశ్వనాథ్ (నిడమర్రు), జయలక్ష్మి (ఉంగుటూరు), హేమకుమారి (పోలవరం), కడిమి రమేష్ (కామవరపుకోట), పోల్నాటి బాబ్జీ (జంగారెడ్డిగూడెం), జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసరి సరితా రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు పిల్లా చరణ్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రాజేష్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ అధ్యక్షురాలు శైల స్వాతీ యాదవ్, లీగల్‌సెల్ అధ్యక్షుడు అల్తి శ్రీనివాసరావు, సోషల్ మీడియా అధ్యక్షుడు చిక్కాల దుర్గాప్రసాద్, బూత్ కమిటీ అధ్యక్షుడు చింత అనిల్‌కుమార్, ప్రచార కమిటీ అధ్యక్షుడు చిలుకూరి జ్ఞానరెడ్డి, ఆర్‌టీఐ అధ్యక్షుడు స్టాలిన్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడు జైబాబు, దెందులూరు యువజన అధ్యక్షుడు పెద్దిరాజు, కైకలూరు యువజన అధ్యక్షుడు చార్లెస్, జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకీ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అప్పనవీడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితాలతో కూటమి ఆటలు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం 'పశ్చిమ' జిల్లా అధ్యక్షుడు సందీప్
- భీమవరంలో ర్యాలీ, ధర్నా

భీమవరం: యువతను నిండా మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ హెచ్చరించారు. భీమవరంలో చేపట్టిన యువత పోరు నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టి ఏడాది గడిచినా ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయలేదని, అయినా లక్షల కోట్లు అప్పులు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం అంటూ ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలుచేయకుండా యువత జీవితాలను ఆటలాడుకుంటున్నారని దుయ్యబట్టారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏడాదిలో జిల్లాలో యువతకు నిరుద్యోగ భృతి బకాయిలు రూ.7,200 కోట్లు ఎగ్గొట్టారన్నారు.

వలంటీర్ల వ్యవస్థకు మంగళం

వైఎస్సార్‌సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతికి ఎగనామం పెట్టడంతో పాటు వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడిందని విమర్శించారు. యువతకు ఉద్యోగాలంటూ మోసం చేసి గొప్పల కోసం డబ్బును వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంతో పాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను కూడా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పథకంలో కొర్రీలు, వసతి దీవెన, విద్యాదీవెన పథకాల ఊసేలేదన్నారు.



భీమవరంలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి ర్యాలీగా..

జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ యువత విభాగం నాయకులు, కార్యకర్తలు భీమవరంలో విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వినతిపత్రం ఇవ్వడానికి ఐదుగురికి మాత్రమే అనుమతి ఇవ్వడంతో సందీప్, వీరన్న, బంధం పూర్ణచంద్రరావు తదితరులు కలెక్టరేట్‌లోకి వెళ్లి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ భీమవరం పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, మాజీ అధ్యక్షుడు కోడే యుగంధర్, రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ మంతెన సునీల్‌వర్మ, జాయింట్ సెక్రటరీ సత్తి రాజశేఖరరెడ్డి, కార్యదర్శి బలం శ్రీను, మానుకొండ ప్రదీప్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ తమనంపూడి సూర్యారెడ్డి, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, అరిగెల అభి షేక్, బేతల సంతోష్, జోగాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్‌లో జేసీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అడుగడుగునా ఆంక్షలు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరు, సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీలు, తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని సెకండ్ ఏఎన్‌ఎంలు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు పోలీసులు ఆంక్షలతో ఇబ్బంది పెట్టారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇవ్వడం కోసం వైఎస్సార్‌సీపీ యువత విభాగం నాయకులు పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో వర్షం ప్రారంభం కావడంతో షామియానా వేసి కూర్చునేందుకు ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. 50 మందికి మించి వెళ్లడానికి వీల్లేదంటూ కలెక్టరేట్‌కు కిలోమీటరు దూరంలోనే అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అలాగే అంగన్‌వాడీలను విస్సాకోడేరు వంతెన వద్ద పోలీసులు నిలువరించారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామంటూ అంగన్‌వాడీల కార్యకర్తలు హెచ్చరించారు.



ఏలూరులో మోటార్ సైకిల్ ర్యాలీ



ఏలూరులో కలెక్టరేట్ వద్ద నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



ఏలూరులో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళా నాయకులు

క్లుప్తంగా

ఫ్రైడ్ ఆఫ్ ఇండియాలో ప్రతిభ



బలగ గణేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): జూన్ 16న బ్రిటన్ నుంచి ఫ్రాన్స్ వరకు 34 కి.మీ. ఇంగ్లిష్ చానల్‌ను ఆరుగురి బృందంతో కూడిన ఫ్రైడ్ ఆఫ్ ఇండియా ఎ టీమ్ స్విమ్మింగ్ చేస్తూ 13 గంటల 37 నిమిషాలు వ్యవధిలో విజయవంతంగా ముగించారు. ఏలూరుకు చెందిన బలగ గణేష్ కూడా ఆ బృందంలో సభ్యుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో బలగ గణేష్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. గణేష్ ఏప్రిల్ 18న శ్రీలంక నుంచి ఇండియా వరకు 28 కి.మీ దూరం పాక్ జలసంధిని 10 గంటల 30 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసి తెలుగు రాష్ట్రాల్లోనే మొట్ట మొదటి పారా స్విమ్మర్‌గా రికార్డు నెలకొల్పడం అభినందనీయమన్నారు. గణేష్‌ను అభినందించిన వారిలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తాడిచెట్టు కూలి ఇల్లు ధ్వంసం



ఇంటిపై పడిన తాడిచెట్టు

దెందులూరు : గాలాయగూడెంలో ఆదివారం రాత్రి భారీ ఈదురు గాలులకు పెండ్లి ఇస్సాకు ఇంటిపై తాడిచెట్టు పడింది. తాడిచెట్టు పడే సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రిస్తున్నారు. అదృష్టవశాత్తు ఇంట్లో ఉన్న ఏ ఒక్కరికి ఏమీ కాకపోవడంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.

కూలిన భారీ వృక్షం



గుండుగొలను సంతమార్కెట్ సమీపంలో..

భీమడోలు: ఆదివారం రాత్రి వీచిన గాలి వానకు పలు గ్రామాల్లో చెట్లు నేలమట్టమయ్యాయి. మండల వ్యాప్తంగా చెట్ల కొమ్మలు సైతం విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలపై పడడంతో పలు చోట్ల కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుండుగొలను సంతమార్కెట్ వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. తీగలు తెగడంతో విద్యుత్ శాఖ అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం జరగకుండా తగు చర్యలు చేపట్టింది. పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

దళితవాడల్లోని స్కూళ్ల విలీనంపై ఆగ్రహం



ఓడూరు పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న పాఠశాల విద్యార్థులు



పెనుమంత్ర పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, విద్యాకమిటీ సభ్యులు

పెనుమంత్ర : మోడల్ స్కూళ్ల పేరుతో దళితవాడల్లో ఎంతోకాలంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలను, యూపీ పాఠశాలలను డౌన్ గ్రేడ్ చేసి వేరే పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా ఆ పాఠశాలల రద్దు దిశగా ప్రభుత్వ ప్రయత్నిస్తోందని, పెనుమంత్ర మండలంలోని పలువురు దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పెనుమంత్ర మండలంలోని అనేక పాఠశాలలను దూర ప్రాంతాలలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేశారు. పెనుమంత్రలోని దళితవాడలో ఎల్ఈ పాఠశాలను డౌన్ గ్రేడ్ చేసి 3, 4, 5 తరగతులను పెనుమంత్రలో దళితవాడకు దూరంగా ఉన్న పెనుమంత్ర (ఆర్) పాఠశాలలో విలీనం చేయడం పట్ల ఆ గ్రామ దళితులు నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఓడూరు పాఠశాల ఉన్న విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెలమూరు గ్రామంలో యూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి ఆ పాఠశాలలో విలీనం చేయడంతో ఓడూరు గ్రామస్తులు కూడా ఆందోళన చేపట్టారు. నెలమూరుకు కేవలం అరకిలో మీటరు దూరంలో కొమ్ముచిక్కాల జడ్పీ ఉన్నత పాఠశాల ఉండగా నెలమూరు యూపీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడంలో రాజకీయాలు చోటు చేసుకున్నాయని ఇది దళితులను విద్యకు దూరం చేయడం కోసం జరుగుతున్న కుట్రలో భాగమేనని దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓడూరు పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉండగా నెలమూరు పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడం పట్ల ఆందోళన చేపడుతున్నారు. సోమవారం రెండు గ్రామాలకు చెందిన దళితులు పాఠశాలల వద్ద ఆందోళన చేయడమే కాకుండా పెనుమంత్ర తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. తమ పిల్లలను వేరొక పాఠశాలకు పంపించేదిలేదని పేర్కొన్నారు. ఇంతవరకు పెనుమంత్ర మండలంలో జుత్తిగ, పాలమూరు, మాముడూరు, ఆలమూరు, మార్టేరులోని బాసంతిదేవి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించారు. ఈ పాఠశాలలో 3 నుంచి 5 తరగతులు ఉన్న విద్యార్థులను వేరొక పాఠశాలల్లో విలీనం చేయగా ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలోని యూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామం మినహా అన్ని గ్రామాలలో చేసిన విలీనాల విషయంలో అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో యు నాగేశ్వరరావును వివరణ కోరగా ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వ నిబంధనలు అనుసరించి విలీనం చేయడం అప్‌గ్రేడ్‌లు చేయడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొన్ని గ్రామాలలో తరగతి గదుల కొరత ఉండటం వల్ల సమీప పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను బట్టి ఆ పాఠశాలల్లో విలీనం చేశామన్నారు.

'సూర్య ఘర్' పథకంపై అవగాహన



పీఎం సూర్యఘర్ పథకం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సోలార్ విద్యుత్ మధ్యతరగతి ప్రజలకు ఎంతో లాభదాయకమని, ఒక్కసారి ఖర్చుపెడితే ఇరవై ఏళ్ల పాటు విద్యుత్ బిల్లులు చెల్లించే పని ఉండదని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పీ సాల్మన్‌రాజు తెలిపారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా గృహ విద్యుత్ వినియోగదారులకు సబ్సిడీ కల్పిస్తూ సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటిపై సోలార్ ప్యానళ్లను సబ్సిడీపై ఏర్పాటు చేసుకోవాలని, దీనికి అన్ని జాతీయ బ్యాంకులు తక్కువ వడ్డీకే సులభ వాయిదాలలో చెల్లించేలా రుణాలు అందిస్తున్నాయన్నారు. గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం లేకుండా ఉండాలంటే సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ పానళ్ల ఏర్పాటుకు కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78 వేలు సబ్సిడీగా ఇస్తుందన్నారు. సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి చేసుకునే విద్యుత్‌లో వినియోగదారులు తాము వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను యూనిట్ రూ.2.09కు విద్యుత్ సంస్థలు కొనుగోలు చేస్తాయని, దాని ద్వారా అసలు బిల్లు చెల్లించకుండా ఆదాయం కూడా వస్తుందన్నారు. ఈ సందర్భంగా సూర్యఘర్ పథకానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ పీ.రాధాకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కమర్షియల్ అండ్ టెక్నికల్ ఏ.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మూలనపడిన ఆక్వా మొబైల్ ల్యాబ్

30 వేల ఎకరాల చెరువులకు పరీక్షలు ప్రశ్నార్థకం



ఏలూరులోని మత్స్యకేంద్రం

దెందులూరు: మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆక్వా మొబైల్ ల్యాబ్ సేవలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పదేళ్ల క్రితం మత్స్యశాఖ ఆధ్వర్యంలో దెందులూరు, ఏలూరు రూరల్, పెదపాడు మండలాలకు సంబంధించి ఆక్వా రైతుల పొలాల మేత, ఇతర పరీక్షల కోసం మొబైల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. రైతులు ఏలూరులోని ల్యాబ్‌కు రానవసరంలేకుండా గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన సమావేశంలో సదస్సులు నిర్వహించి మేత, నీరు ఇతర శాంపిల్స్ తీసుకుంటారు. మొబైల్ వ్యాన్ సిబ్బంది రైతుల వద్దకు వెళ్లి మొబైల్ ల్యాబ్‌లో ఉన్న టెస్టులు చేస్తారు. మిగిలిన టెస్టులకు శాంపిల్స్ తీసుకొని ఏలూరు మత్స్య శాఖ కార్యాలయానికి వచ్చి పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసి రిపోర్టులను రైతులకు పంపుతారు. కొంతకాలంగా ఈ సేవలు నిలిచిపోయాయి. దీంతో దెందులూరు ఏలూరు రూరల్, పెదపాడు మండలాల్లోని 30 వేల ఆక్వా రైతుల చెరువుల్లో పరీక్షలు ప్రశ్నార్థకంగా మారాయి.

నామమాత్రంగా ల్యాబ్ సేవలు

ఆక్వా మొబైల్ ల్యాబ్ సేవలు బాటలోనే ఏలూరు మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో ఉన్న ఆక్వా ల్యాబ్ లో కూడా పరీక్షలు తూతూ మంత్రంగా ఉన్నాయి. ఆక్వాకు సంబంధించి మేత పరీక్ష ప్రాధాన్యమైంది. మేతకు సంబంధించి నాలుగు పరీక్షలు ఈ ల్యాబ్‌లో జరగాల్సి ఉండగా ఒక పరీక్ష మాత్రమే చేస్తున్నారు. మిషన్లు పనిచేయని కారణంగా పరీక్షలు జరగటం లేదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతుల అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఇవి జరగటం లేదు.

పరీక్షలు జరగకపోతే ఎలా?



ఆక్వాలో నీరు, మేత, ఇతర పరీక్షలు చాలా ముఖ్యమైనవి. ఇవే లేకపోతే ఆక్వా సాగు లేనట్టే. ప్రభుత్వం ఆక్వా సాగుకు మద్దతు, ప్రోత్సాహం, నిధులు కేటాయింపు ఇస్తామని ఊదరగొడుతోంది. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం బాధాకరం.

– డీబీఆర్‌కే చౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

ఆక్వా రైతుల గోడు పట్టదా?



మొబైల్ ల్యాబ్ పనిచేయక పోయినా ప్రభుత్వం పట్టించుకోకపోతే ఏమనాలి. జిల్లా కార్యాలయంలో ఉన్న ల్యాబ్‌లో టెస్టులు సైతం అరకొరగా జరుగుతున్నాయి. వెంటనే మొబైల్ ల్యాబ్ రిపేరుకు చర్యలు తీసుకోవాలి. జిల్లా కార్యాలయంలో ఉన్న ల్యాబ్‌లో అన్ని పరీక్షలు జరిగేలా చూడాలి.

– నిట్టా లీలా నవకాంతం, దెందులూరు జడ్పీటీసీ

బెల్టుషాపులపై దాడి

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మండలాల్లో సిబ్బంది సోమవారం దాడులు చేసి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఏ మస్తానయ్య తెలిపారు. ఆగిరిపల్లి మండలం సీతారామపురానికి చెందిన మల్లెల శివనాగరాజు వద్ద 10 మద్యం సీసాలు, ముసునూరు మండలం చింతలవల్లికి చెందిన పలగాని విమల వద్ద 10 మద్యం సీసాలు, చెక్కపల్లికి చెందిన చెంగల వెంకటేశ్వరరావు వద్ద 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టుషాపులకు మద్యంను సరఫరా చేస్తే సంబంధిత షాపుపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వ్యాపారం చేసుకోవాలన్నారు. అలాగే బెల్టుషాపుల నిర్వహణకు అనుమతులు లేవని, బెల్టుషాపులు నిర్వహించేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ వి.భీమారావు

భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మళ్లీ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు ఎస్పీ వి.భీమారావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ నిర్వహించారు. వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను అదనపు ఎస్పీ స్వయంగా స్వీకరించి వారి సమస్యలను విని, పూర్తిస్థాయి విచారణ జరిపి శాశ్వత పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. పలు సమస్యలపై మొత్తం 17 అర్జీలను అదనపు ఎస్పీ స్వీకరించారు.

గర్భిణి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో గర్భిణీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఏలూరు శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తోన్న కాళిదాసు దేవి(30) భర్తతో కలిసి జీవిస్తోంది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు సమాచారంతో ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు ఆదేశాలతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గర్భిణీ ఆత్మహత్యపై సందేహాలు వ్యక్తం కావటంతో త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ఉపాధి కూలీలకు బెదిరింపులపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ కూలీలను బెదిరించి, ఇబ్బంది పెట్టిన బీజేపీ నాయకులు, జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరఫున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొయ్యలగూడెంలో రోటరీ క్లబ్‌లో బీజేపీ నిర్వహించిన సమావేశం సందర్భంగా బెదిరించి ఉపాధి హామీ కూలీలు సుమారు 200 మందిని బీజేపీ సమావేశానికి తీసుకెళ్లారన్నారు. ఆ సమావేశంలో బీజేపీ కరపత్రాలు పంపిణీ చేసి, ఆ పార్టీ కండువాలు ఇష్టం లేకపోయినా బలవంతంగా మెడలో వేసిన బీజేపీ నాయకులపై, బెదిరింపు చర్యలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పెదవేగి కర్మాగారం ప్రైవేటీకరిస్తే ఊరుకోం



పెదవేగి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం, సీఐటీయు నేతలు

పెదవేగి: ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీఐటీయు జిల్లా నాయకులు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం పెదవేగిలోని ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని పరిశీలించి కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫ్యాక్టరీ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరించి రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ప్రభుత్వం ఆలోచన చేయడం తగదన్నారు. ఫ్యాక్టరీ జోన్ పరిధిని, ఫ్యాక్టరీని ప్రైవేటు వారికి అప్పగించాలనే ప్రయత్నాలు వెంటనే విరమించుకోవాలని కోరారు. దేశంలోనే అత్యధిక ఆయిల్‌పామ్ విస్తీర్ణం ఏలూరు జిల్లాలోనే ఉందన్నారు. ఆయిల్ పామ్ గెలల ధర ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో వచ్చే ఆయిల్ రికవరీ శాతం(ఓ ఇ ఆర్) ప్రామాణికంగా ఉందని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణతో భవిష్యత్తులో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ చర్యలు ఆపి కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ రైతులు సంఘటితంగా పోరాడి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

డ్రైవర్ తొందరపాటు వల్లే ప్రమాదం



ద్వారకాతిరుమలలో ఆదివారం స్తంభాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు(ఫైల్)

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదానికి డ్రైవర్ కంగారు, తొందరపాటే కారణమని తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక గుడిసెంటర్ నుంచి సుమారు 70 మంది యాత్రికులతో తణుకుకు బయల్దేరిన ఏపీ16జెడ్ 215 నెంబర్ ఆర్టీసీ బస్సు డీసీసీబీ బ్రాంచి ఎదురుగా ఉన్న దేవస్థానం స్ట్రీట్‌లైట్ స్తంభాన్ని, ఆ తరువాత షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం బస్సు బ్రేక్‌లు విఫలం కావడం వల్లే జరిగిందని డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. బస్సును నిశితంగా పరీక్షించిన తణుకు డిపో మెకానికల్ సిబ్బంది బస్సుకు ఏ విధమైన కంప్లైంట్‌లు లేవని, బ్రేక్‌లు బాగానే ఉన్నట్టు తేల్చారని డిపో మేనేజర్ తెలిపారు. గుడి సెంటర్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో డ్రైవర్ కొద్దిపాటి కంగారు, తొందరపాటు వల్లే బస్సు డ్రైనేజీలోకి జారి ఈ ప్రమాదం జరిగిందన్నారు. గత పది రోజులుగా ఈ బస్సుకి ఏ విధమైన కంప్లైంట్‌లు లేవని తెలిపారు. విచారణ అనంతరం ప్రమాదానికి కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని గిరిధర్ కుమార్ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతుడు బండారు కోటేశ్వరరావు

నూజివీడు: మండలంలోని ముక్కొల్లుపాడులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వ్యక్తి మృతిపై మృతుడి తల్లి బండారు దుర్గమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండారు కోటేశ్వరరావు(44) పొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి నూజివీడు రామాయమ్మరావుపేటకు చెందిన ప్రమీలతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ప్రమీలకు అదే గ్రామానికి చెందిన ఇర్ల మహేష్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీనిపై ప్రమీలకు ఆమె భర్త కోటేశ్వరరావుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో తల్లి దుర్గమ్మ కొడుకును నిద్ర లేపగా ఎంతకీ లేవకపోయే సరికి పరీక్షించగా.. మృతిచెంది ఉన్నాడు. ఆదివారం సాయంత్రం ఇర్ల మహేష్ తల్లి జమలమ్మ, మహేష్ తమ్ముడు భార్య హైమావతి కలిసి కోటేశ్వరరావుతో గొడవ పడ్డారు. కోటేశ్వరరావు ఇంటికి వెళ్లి భోజనం పెట్టమని అడగగా భార్య పెట్టకపోవడంతో తన అన్న ఇంటికి వెళ్లి భోజనం చేశాడు. భోజనం చేసిన కొద్దిసేపటికే కోటేశ్వరరావు వాంతులు చేసుకున్నాడు. ఆ తరువాత ఇంటికి వెళ్లి పడుకున్నాడు. తన కుమారుడి మృతి విషయంలో కోడలు ప్రమీల, ఇర్ల మహేష్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి ఎంవీఆర్ టౌన్‌షిప్ సమీపం ఒక భవనంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ సీఐ రమేష్, ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, ఆరు మోటారు సైకిళ్లు, ఒక కారు, తొమ్మిది సెల్ ఫోన్లు, రూ.1.63 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు

ఏలూరు(మెట్రో): ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ కె. వెట్రిసెల్వి సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో రూ.4.68 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ దృష్టి లోపం, బధిరులు, చలన వైకల్యం గల విద్యార్థినీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్టు చెప్పారు.

అన్నదాతపై బీమా భారం

- ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
- బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంటలకు ఉచిత బీమా



సార్వాకు దమ్ము చేస్తున్న రైతులు

పెంటపాడు: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలి. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పనిచేస్తోంది. రైతులకు అండగా ఉండడం మాట అటుంచితే, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ రైతులపై పగ సాధింపు చర్యల్లా ఉన్నాయని పలువురు రైతులు అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంట బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాలు, తుఫాన్‌లతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు రైతులను ఆదుకునేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంట బీమా పథకాన్ని ఈ–క్రాప్‌లో నమోదు చేసి సాగు విస్తీర్ణం అంతటికీ బీమా వర్తించేలా ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించేది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడేది కాదు. బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండేది కాదు. పంటలకు నష్టం వాటిల్లితే ఠంచన్‌గా పరిహారం అందేది. నియోజకవర్గంలో 2021 ఖరీఫ్ సీజన్‌లో తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతినగా వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిహారం అందించింది.

రైతన్నల ఆవేదన

చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంట బీమాను రద్దు చేయడంతో ప్రీమియం భారం రైతులపై పడుతోంది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా కోసం రైతులే ప్రీమియం సొమ్ము చెల్లించాలంటూ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. పంటల బీమా ప్రీమియం చెల్లింపులు రైతులే చేయాలని ప్రభుత్వం నిర్ణయం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వమే రైతుల తరఫున సంబంధిత బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇంకా అందించలేదని, అప్పులు చేసి పంటు సాగు చేస్తున్నామని ఇప్పుడు బీమా పథకాన్ని కూడా నీరుగార్చితే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సమంజసం కాదు



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా చెల్లించాలని అనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేయాలి – **పాలా గణపతి, కొండేపాడు, రైతు**

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్స్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. వేల్పూరు రోడ్డు, నరేంద్ర సెంటర్, రాష్ట్రపతి రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, బ్యాంక్ కాలనీ, సజ్జాపురం, రామకృష్ణ మఠం, ఎన్ఎస్‌సీ బోస్ రోడ్డు, బొమ్మల వీధి, కప్పల వెంకన్న సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు టూ టౌన్ సౌత్‌లో విద్యుత్ నిలుపుదల

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లోని సౌత్ సబ్ స్టేషన్ పరిధిలో 33కేవీ లైన్‌లో 11కేవీ మార్కెట్ ఫీడర్, 11కేవీ ఈనాడు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. భాగ్యలక్ష్మిపేట, యాగర్లపల్లి, కొబ్బరితోట, మార్కెట్ ఏరియా, ఏలూరు రోడ్డు, రామచంద్రరావుపేట, మోడ్రన్ కేఫ్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

వీఆర్.గూడెంలో గొర్రెలకు టీకాలు



వెంకట్రామన్నగూడెంలో గొర్రెలకు నీలి నాలుక నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి టీకాలు వేసే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.వి.విజయ్ కుమార్ మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులకు తొలకరిలో వచ్చే వ్యాధులు, వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మొత్తం 849 గొర్రెలకు టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ సహాయకులు మురళీ, చందు, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



మాధవరం సచివాలయంలో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మాజీ సైనికులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయని మాజీ సైనికుల సంక్షేమ సంఘ ప్రతినిధి గోపిశెట్టి భరతుడు పేర్కొన్నారు. మండలంలోని మాధవరం పంచాయతీలో గుమస్తాగా పనిచేస్తూ పదోన్నతిపై నవాబుపాలెం పంచాయతీ కార్యదర్శిగా వెళ్తున్న శ్రీనివాస్‌కు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతుడు మాట్లాడుతూ గుమస్తాగా శ్రీనివాస్ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. అందరి తలలో నాలుకలా ఉంటూ అధికారులు, ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



మునిసిపల్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో పది ఫిర్యాదులు వచ్చాయి. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి నాలుగు, ఇంజనీరింగ్ విభాగానికి గాను ఒకటి, ప్రజారోగ్యానికి గాను నాలుగు, రెవెన్యూ విభాగానికి గాను ఒకటి వినతిపత్రాలు వచ్చాయి. కమిషనర్ ఎం.ఏసుబాబు, మునిసిపల్ ఇంజనీర్ వై.వీ.రమణ, అసిస్టెంటు కమిషనర్ డి.రవికుమార్ అధికారులు పాల్గొన్నారు.

మాధవరంలో ఎక్సైజ్ తనిఖీలు



మాధవరంలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి డ్యూటీ పెయిడ్ లిక్కర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాధవరం గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా, మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 31 మద్యం సీసాలు, 10 బీర్ బాటిల్స్ వెరసి మొత్తం 41 డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మీకోసంకు ఐదు అర్జీలు

ఆకివీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు బదలాయించినట్లు ఆమె చెప్పారు. దుంపగడప గ్రామంలోని మంచినీటి చెరువుకు ఆనుకుని రొయ్యల చెరువు సాగు చేస్తున్నారని, చెరువు నీటిని పంట కాల్వలోకి వదిలివేస్తున్నారని మూడేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించోవడంలేదని గ్రామానికి చెందిన సూరంపూడి రాంబాబు ఫిర్యాదు చేశారు. స్థానిక పొట్టిశ్రీ రాములు విగ్రహం వద్ద పెద పల్లి వీధి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించాలని, అలాగే స్థానిక ఉల్వర్టన్ పేటలోని దారి మార్గం సర్వే చేయాలని, ధర్మాపురంలోని ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న ఇళ్ల ఖాళీ చేసేందుకు ఆరు నెలలు గడువు కోరుతూ అర్జీలు అందాయి.

కె. కుముదవల్లి గ్రామంపై చిన్నచూపేల?

- అధ్వాన దారులు
- మౌలిక సదుపాయాలు లేక ఇక్కట్లు



కుముదువల్లిలో రోడ్డు మీద నిలిచిన నీరు

ఇరగవరం: మండలంలోని కె కెముదవల్లి గ్రామంలో ప్రజలు నిత్యం సమ్యలతో సతమతమవుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో రజకపేటలోని రామాలయం తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయంగా మారిపోయాయి. రోడ్లపై నీరు నిలిచి వాహనచోదకులు, ప్రయణికులు రాత్రి సమయాల్లో ప్రదాలబారిన పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాలు ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఇప్పటికైనా కె కెముదవల్లి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. గృహాల మధ్య వర్షపు నీరు నిలిచి పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించండి



కె కుముదువల్లి గ్రామంలో చినుకు పడితే చాలు వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచి పోతుంది. ఈ సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు పరిష్కారం కాలేదు. డ్రెయినేజీలు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే అదేశించిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన సమస్యను పరిష్కరించి ప్రజలు రోగాల భారీన పడకుండా బాధ్యత అధికారులపై ఉంది. **కాకరపర్తి రామలింగేశ్వర రావు, మాజీ ఎంపిటీసీ...**

కవి కోపల్లె శ్రీనివాస్‌కు ఘన సత్కారం



కోపల్లె శ్రీనివాస్‌కు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నటులు, కవి కోపల్లె శ్రీనివాస్‌కు కాకినాడలో ఘన సత్కారం జరిగింది. ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కాకినాడలో శ్రీశ్రీ కళావేదిక సాహితీ జాతర 149వ జాతీయ ద్విశత కవి సమ్మేళనం ఇటీవల జరిగింది. సమ్మేళనంలో పాల్గొన్న కోపల్లె శ్రీనివాస్ దేశ రక్షణలో సైనికుల గొప్పతనం, తల్లి మనస్సుపై చదివిన కవిత ప్రత్యేకతను చాటుకున్నది. పండితుల ప్రశంసలు అందుకున్నారు. ప్రశంసాపత్రం, సత్కారాలు జరిగాయి. పట్టణ ప్రముఖులు, కవులు, నటులు, సాహితీ సభ్యులు, కళాకారులు కోపల్లెకు అభినందనలు చెప్పారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



ఇంజనీరింగ్ సిబ్బంది రిలే దీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని పలువురు వక్తలు మత్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, నూకపల్లి శేఖర్, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, బండారు శ్రీను, అడ్డాల చలపతి, ప్రత్తి రమేష్‌లు కోరారు. ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగపు కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ జేఏసీ పిలుపులో భాగంగా సోమవారం నుంచి సమ్మె ప్రారంభం కాగా విధులను బహిష్కరించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద సిబ్బంది రిలే దీక్షలు చేశారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ టెక్నికల్ సిబ్బందికి జీతాలు రూ 29,200లు, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ 24,500లు అమలు చేయాలని, పది సంవత్సరాలు పైబడి కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఏపీసీఓఎస్ రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. పెద్ద సంఖ్యలో కార్మికులు సంఘీభావం ప్రకటించారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



తణుకులో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మికులు

తణుకు అర్బన్: మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ నాయకులు గెల్లా విజయ్‌కుమార్, ఉండ్రాజవరపు శ్రీను డిమాండ్ చేశారు. తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరాహార దీక్షల శిబిరంలో వారు మాట్లాడారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి పూర్తిస్థాయి సమ్మెలోకి దిగినట్లు చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే దిశగా పాటుపడాలని కోరారు. ఇటీవల కాలంలో దఫదఫాలుగా నిరసనలు, నిరాహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వం ఎటువంటి చొరవ చూపకపోవడంతో తప్పనిసరిగా సమ్మెలోకి వెళ్తామని, ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలన్నారు. 25 ఏళ్లుగా తక్కువ వేతనంతోనే పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని అయినప్పటికీ మాకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల దానం, పి.శ్రీదేవి, సూర్యలక్ష్మి, కోటేశ్వరి, భార్గవి, పిండి పెద్దిరాజు పాల్గొన్నారు.

అవగాహనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: విధులు, బాధ్యతలపై కనీస అవగాహనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం, అత్తిలి మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్లుగా సత్యనారాయణ, విశ్వనాథ్, కళ్యాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ పంచాయతీ పరిపాలనపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళా సాధికారిత, అక్షరాస్యత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యాబోధనలో వినూత్న మార్పులు తీసుకురావాలి

భీమవరం: విద్యాబోధనలో వినూత్న మార్పులు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని తమిళనాడులోని మధురై త్యాగరాజ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎస్ భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా విధానంలో టీచింగ్ లెర్నింగ్‌లో లక్ష్యాలు సాధించే దిశగా మార్పులు జరగాలన్నారు. పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా విద్యా బోధన ఉంటే విద్యార్థులు మరిన్ని ఫలితాలు సాధించగలరని భాస్కర్ నొక్కి చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో ఎప్పటికప్పుడు మార్పులను తీసుకురావాలి.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పందిగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 16 మందికి సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయులు నిల్లా సురేష్ బాబు తెలిపారు. అలాగే పట్టణానికి చెందిన దాత తెలనాకుల కిరణ్ కుమార్ పాఠశాలకు రూ.10 వేలు విలువ చేసే టేబుల్, కుర్చీలను బహూకరించినట్లు చెప్పారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మలేరియా పట్ల అప్రమత్తత అవసరం



తణుకులో మలేరియా మాసోత్సవాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: మలేరియా వ్యాధిని వ్యాప్తిచేసే ఎనాఫిలస్ దోమ మంచి నీటిలోనే దోమల లార్వాను పెడుతుందని, కదలికలేని మంచి నీటిని కూడా తరచూ తొలగించుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు ఎన్జీవో కాలనీ, అజ్జరం రోడ్డు, వినాయక స్వామి ఆలయం ప్రాంతాల్లో సోమవారం మలేరియా నివారణ మాసోత్సవం 2025 అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్మోడియం పరాన్నజీవి, ఫిమేల్ ఎనాఫిలస్ ఆడదోమ కాటు ద్వారా మనిషిలో ప్రవేశించినపుడు మలేరియా వ్యాధి వస్తుందని అన్నారు. ముఖ్యంగా ఉపయోగంలో లేని చెరువులు, నీటి బావులు, నీటిగుంటలు, లోతట్టు ప్రాంతాలు, కాలవలు, సిమెంట్ ట్యాంకుల్లో మలేరియా వ్యాప్తిచేసే దోమలు గుడ్లు పెడతాయని చెప్పారు. ఆ గుడ్లు పది రోజుల్లోగా దోమలుగా మారతాయని, ఇవి రాత్రి పూటకుడతాయని స్పష్టం చేశారు. దోమలు కుట్టకుండకుండా తీసుకునే చర్యల్లో భాగంగా దోమ తెరలు వేసుకోవాలని, ఇండ్ల ఆవరణలో దోమ వికర్షకాలైన బంతి, పుదీనా మొక్కలను పెంచుకోవాలని, ప్రతిరోజూ కొద్దిపాటి సమయాన్ని వెచ్చించి శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యన్నారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు కె.ప్రసన్నరాణి, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఫిమేల్) ఎం.పద్మావతి పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

ఆకివీడు: కూటమి ప్రభుత్వం సున్నా వడ్డీ సౌకర్యం కల్పించకపోవడం దారుణమని డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఐద్వా కార్యాలయంలో సోమవారం డ్వాక్రా మహిళల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ డ్వాక్రా రుణాలకు వడ్డీల భారం తడిసి మోపుడవుతోందని వాపోయారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ మహిళలకు అభయ హస్తం పేరుతో చాలా మంది డబ్బులు కట్టడం జరిగిందన్నారు. ఉపకార వేతనాలు, పింఛన్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీనిధి పేరుతో లక్షల రూపాయలు డిపాజిట్లుగా సమృద్ధి పొదుపులు కట్టించుకున్నారన్నారు. 2018 నుంచి శ్రీనిధి రుణాల్లో భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆమె వాపోయారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పొదుపు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌బీఐ మేనేజర్ కె.ప్రసాద్ ఉన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గోపీమూర్తి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేసి వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పోడూరు మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసిన ఆయన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడిలు క్రియేట్ చేసి ఆలస్యం కాకుండా జీతాలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యా యులకు రావాల్సిన డీఏ, పీఎఫ్ రుణాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, రాష్ట్ర కౌన్సిల్ ఎంవీ రాజశేఖర్, మండల అధ్యక్ష కార్యదర్శులు క్షేమమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు మండల వైద్యాధికారిగా గులాబ్ రాజ్‌కుమార్

పాలకోడేరు: పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిగా ఎం.గులాబ్ రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు వీరవాసరం మండలంలో పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పాలకోడేరుకు వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు కాళ్ల పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గులాబ్ రాజ్‌కుమార్ గతంలో పాలకోడేరులో పని

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళి

అత్తిలి: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని పాలి గ్రామంలో బీజేపీ మండల కార్యదర్శి అప్పారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతీయ జనసంఘ్‌ను స్థాపించి రాజకీయ నూతన దశను ప్రవేశపెట్టిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు తెలిపారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



గొడుగులు పంపిణీ చేస్తున్న జిజ్జువరపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చర్మకారుల, డప్పు కళాకారుల సంక్షేమానికి అవసరమైన ఆర్థిక సహకారం, పనిముట్లు అందజేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ అన్నారు. స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో సోమవారం దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన దళిత సేన జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. రవి ప్రకాష్ మాట్లాడుతూ ఏపీలో లెథర్ కార్పొరేషన్‌ను లీడ్ క్యాప్ ద్వారా ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో కార్మికుల అభివృద్ధికి నిధులు కేటాయించి వారి సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీలి మోహన్‌రావు, దూలపల్లి సత్తయ్య, కిలాడి రవి, గడ్డం సుందరరావు, సుబ్బారావు, శ్రీనివాస్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పాలకోడేరు: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు నేతృత్వంలో సోమవారం గరగపర్రులో దాడులు నిర్వహించి, గ్రామానికి చెందిన కె.రాజు అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి కృషిచేయాలి



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: పట్టణంలో జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీ చేయడానికి కృషి చేయాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి పోలీసు స్టేషన్‌లో ఎన్ని రాజీ పడదగ్గ కేసులున్నాయనే వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్న కేసుల రాజీకి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, 1వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ పి.హనీష, 2వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ నాగరాజు, వివిధ పోలీసుస్టేషన్ అధికారులు పాల్గొన్నారు.